సాక్షి
ఒడిశా

మంగళవారం | 20 | ఆగస్టు | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,74,779లు, బంగారం 3 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 15 గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ముగిసిన బోల్ భం దీక్షలు

రాష్ట్రంలో గత నెల రోజులుగా భక్తులు చేపట్టిన బోల్ భం దీక్షలు విరమించారు.

- 8లో



తోటి విద్యార్థిపై కత్తితో దాడి

ఇద్దరి విద్యార్థుల మధ్య ఘర్షణ కత్తితో దాడికి దారి తీసింది.

- 8లో

న్యూస్‌రీల్

వచ్చే ఏడాది నుంచి విద్యార్థి సంఘాల ఎన్నికలు

● మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: కళాశాలలు, వర్సిటీల విద్యార్థి సంఘాల ఎన్నికలు వచ్చే ఏడాది నుంచి నిర్వహించనున్నట్లు రాష్ట్ర న్యాయ, రోడ్లు - భవనాలు, ఎక్సైజ్ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సోమవారం తెలిపారు. విష్ణు సామంతరాయ కళాశాల 45వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఈ విషయం వెల్లడించారు. ఏటా సెప్టెంబర్ నెలలో ఎన్నికలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమయం సరిపోకపోవడంతో ఈ ఏడాది ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందన్నారు.

ఒడిశా కార్మికులను తీసుకొస్తాం

● మంత్రి గణేష్ రాంసింగ్ ఖుంటియా



భువనేశ్వర్: రాష్ట్రం నుంచి బంగ్లాదేశ్ వలస వెళ్లిన కార్మికులను తీసుకొస్తామని, ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గణేష్ రాంసింగ్ ఖుంటియా సోమవారం తెలిపారు. రానున్న 15 నుంచి 20 రోజుల్లో కార్మికులు తిరిగి వస్తారని హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్‌కు ఎంతమంది వెళ్లారనే జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. అన్ని జిల్లాల కార్మిక అధికారులకు ఈ బాధ్యతలు కేటాయించినట్లు వెల్లడించారు.

వినూత్న నిరసన



రహదారిపై వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు

రాయగడ: గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదని ప్రజలు వినూత్నంగా నిరసన తెలిపారు. జిల్లాలోని గుణుపూర్ సమితి కొలుసింహ పంచాయతీలోని కడాసి నుంచి తెలగుట గ్రామానికి వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల రహదారి అస్తవ్యస్తంగా ఉంది. దీంతో పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు స్థానికులు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా రహదారి పూర్తిగా బురదమయమయ్యింది. దీంతో గ్రామస్తులంతా కలిసి రహదారిపై సోమవారం వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

పాటుకాటుతో వ్యక్తి దుర్మరణం



మధుని ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

జయపురం: బొయిపరిగుడ సమితిలో పాము కాటుకు వ్యక్తి దుర్మరణం చెందాడు. బొయిపరిగుడ ఏఎస్‌ఐ గజానన నాయిక్ తెలిపిన వివరాల మేరకు.. కకొడిపాణి గ్రామానికి చెందిన మధు మఝి(40) ఆదివారం రాత్రి ఇంటివద్ద నిద్రిస్తున్న సమయంలో ఒక పాము కాటు వేసింది. దీంతో అతను నొప్పితో కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మధు మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గజానన నాయిక్ వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుం సభ్యులకు అప్పగించినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

యువకుడు గల్లంతు



యువకుడి కోసం గాలిస్తున్న అగ్నిమాపక దళం

భువనేశ్వర్: కటక్ జగత్‌పూర్ వద్ద కేంద్రపడా కాలువలో యువకుడు గల్లంతయ్యాడు. సోమవారం స్నానం చేస్తుండగా యువకుడు నీట మునిగినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. గల్లంతైన యువకుడు పేరు బిట్స్ యాదవ్. సహాయక చర్యలో భాగంగా అగ్నిమాపక దళం సిబ్బంది యువకుడి కోసం గాలిస్తున్నారు.

అందాల అతిథులు..!



రాయగడ జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న వంశధార తీరానికి **అందాల అతిథులు** చేరుకున్నాయి. గత 18 ఏళ్లుగా ప్రతీ ఏడాది జూన్ నుంచి **విదేశీ** విహంగాలు సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా సైబీరియా వంటి ప్రాంతాల నుంచి ఇవి ఇక్కడికి చేరుకుంటున్నాయి. శీతాకాలం చివరి వరకు ఇక్కడ ఉంటూ, గుడ్లను పొదిగి తిరిగి వెళ్లేటప్పుడు వాటి పిల్లలతో తమ గమ్యానికి చేరుకుంటాయి. అయితే వేటగాళ్ల బారి నుంచి రక్షించేందుకు అటవీ శాఖ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో పక్షుల సంఖ్య తగ్గుతోందని పక్షుల ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – రాయగడ

















గణేష్ పూజల్లో డీజేలు నిషేధం

● భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్

భువనేశ్వర్: సెప్టెంబర్ 7 నుంచి గణేష్ పూజలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నగర కమిషనరేట్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది గణపతి పూజల్లో సందడి కోసం డీజేల వినియోగం నిషేధించారు. పూజోత్సవాల ఆద్యంతాలు ఈ నిషేధం వర్తిస్తుందని నగర డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. బదులుగా, సాంప్రదాయ సంగీత వాయిద్యాలను వినియోగించడంపై ప్రాధాన్యత కల్పించారు. ఈ మేరకు పూజా కమిటీలతో సవివరమైన చర్చలు జరిపినట్లు నగర డీసీపీ ప్రతీక్ సింగ్ వివరించారు. సెప్టెంబర్ 8, 11, 15 తేదీల్లో నిర్వహించే నిమజ్జన యాత్రకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఊరేగింపు సమయంలో డీజేలు బదులుగా సంప్రదాయ సంగీత వాద్యాలను ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఊరేగింపుల వల్ల నగర ట్రాఫిక్‌కు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా కమిటీలు బాధ్యతలు వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పూజా పందిళ్ల ప్రాంగణంలో సందర్శకుల వాహనాల కోసం విశాలమైన పార్కింగ్ స్థలం, అగ్నిమాపక సంరజామా, సీసీ కెమెరాలు, వాలంటీర్ల ఏర్పాటు వంటి అంశాలపై కూడా పూజా కమిటీలతో చర్చించారు. వినాయక విగ్రహాలను వికృతంగా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సంజీవ్ పండా హెచ్చరించారు. విగ్రహాలపై అపవిత్ర చర్యలకు పాల్పడే క్లబ్ లేదా సంస్థలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమానాస్పదంగా సీఆర్పీఎఫ్ జవాన్ మృతి



అర్జున్ చరణ్ నాయక్(ఫైల్)

కొరాపుట్: అనుమానాస్పద స్థితిలో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి చెందిన ఘటన కలహండి జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని భవానీపట్న బజారు ప్రాంతంలో ఉండే 64వ సీఆర్పీఎఫ్ బెటాలియన్ జవాన్ అర్జున్ చరణ్ నాయక్ (49) సోమవారం మృతి చెందాడు. జగత్‌సింగ్ పూర్ జిల్లాకి చెందిన అర్జున్ ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. కానీ ఉదయానికే బ్యారెక్‌లో మృతి చెందడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సీఆర్‌పిఫ్ ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న భగవాన్ బైరాగి

కొరాపుట్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న బంద్ విజయవంతం చేయాలని నబరంగ్‌పూర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ జాయింట్ ఆర్గనైజేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు పిడ్యూడి బంగ్లాలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు భగవాన్ బైరాగి మాట్లాడారు. ఈ తీర్పుతో క్రమేపీ ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఎత్తేవేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలను విడదీయానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మరోవైపు జోరిగాంలో ప్రభుత్వ కార్యాలయాలకు బంద్‌కు మద్దతు తెలపాలని వినతి పత్రాలు అందజేశారు.

గోమాంసం స్వాధీనం



గోమాంసం పడిన స్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు



గోమాంసం ప్యాకెట్లు

రాయగడ:

జిల్లాలోని మునిగుడ సమితి తెలంగపాదొరా గ్రామ సమీపంలోని బ్రిడ్జి కింద 30 గోమాంసం ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని గొయ్యితవ్వి పాతిపెట్టారు. అయితే ఇవి ఎక్కడి నుంచి వచ్చాయనేది తెలియాల్సి ఉంది. వివరాల్లోకి బ్రిడ్జి కింద నుంచి దుర్వాసన వస్తుండడంతో అటువైపుగా వెళ్లే కొందరు గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూశారు. దీంతో ఖరీదైన ప్యాకింగ్‌తో పడి ఉన్న గోమాంసం వారికి కనిపించింది. దీంతో ఆ విషయాన్ని తెలంగపాదొరా సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆ సర్పంచ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం సాయంత్రం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్యాకెట్లలో ఉన్నది గోమాంసమని నిర్ధారించుకున్న వెంటనే సమీపంలో గొయ్యితీసి పాతిపెట్టారు. అయితే గత కొద్దిరోజులుగా ఈ ప్రాంతం నుంచి గోమాంసం అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఈ బ్రిడ్జి సమీపంలో ఒక బొలేరో వ్యాన్ బోల్తాపడింది. వ్యాన్‌లోని కొన్ని వస్తువులు బ్రిడ్జి కింద పడిపోవడం జరిగింది. అయితే బొలేరోలో గోమాంసం అక్రమ రవాణా జరిగినట్లు అనుమానిస్తున్నారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

ప్రభో జగన్నాథ ... పాహిమాం



అరుణ స్తంభం ఎదుట సాష్టాంగ దండ ప్రణామం



సింహద్వారం ఆవరణలో బోరుమంటున్న మహిళ



శ్రీమందిరం వాకిలిలో మొర ఆలకింపజేస్తున్న మహిళ

పూరీ శ్రీజగన్నాథుని సన్నిధి శ్రీమందిరం ఆవరణలో సోమవారం ఒక మహిళా భక్తురాలు కుండపోత వర్షం కురుస్తుండగా, అరుణ స్తంభం నుంచి సింహద్వారం ప్రాంగణం 22 మెట్ల మార్గం వరకు అడుగడుగునా సాష్టాంగ దండ ప్రణామం చేస్తూ ముందుకు సాగింది. ఎవరూ ఓదార్చలేనంతగా బోరుమంటూ గుండెల నిండా దాచుకున్న తన బాధను జగన్నాథుని సమక్షంలో వెల్లబుచ్చేందుకు చేసిన ప్రయాస సందర్శకుల మనసుని కలచి వేసింది. ఇటీవల కాలంలో ఇటువంటి భక్తి భావోద్వేగ దృశ్యం తారసపడడం ఇదే తొలిసారి కావడం విశేషం.

భువనేశ్వర్

క్లుప్తంగా

నేటి నుంచి మలి విడత అసెంబ్లీ సమావేశాలు

భువనేశ్వర్: మలి విడత శాసన సభ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగాల్సి ఉంది. మలి విడత సమావేశాల్లో మహిళలను ఊరిస్తున్న సుభద్ర యోజన అమలు, కార్యాచరణ కోసం నిర్ధారిత కార్యాచరణ (ఎస్‌ఓపీ) సభలో ప్రవేశపెడతారు. ఇటీవల చేసిన ప్రకటన ప్రకారం సోమవారం ఈ పథకం వివరాలు ప్రకటించాల్సింది. శాసన సభ సమావేశాలు జరుగుతున్నందున సభ బయట ప్రకటించడం తగదని భావించి సభలో ప్రకటించనున్నారు.

పీఎంఏవై సాయం రూ. 1.8 లక్షలకు పెంపు

● మంత్రి రబీ నారాయణ్ నాయక్


రబీ నారాయణ్ నాయక్

భువనేశ్వర్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఆర్థిక సాయాన్ని రూ. 1.8 లక్షలకు పెంచనున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ మంత్రి రబీ నారాయణ్ నాయక్ తెలిపారు. త్వరలోనే ఈ మేరకు ఉత్తర్వులు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. అదనంగా రాష్ట్రంలో 500 గిరిజన గ్రామాల అభివృద్ధికి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశామన్నారు. ఇదివరకు పీఎంఏవై సాయం లబ్ధిదారులకు రూ.1.2 లక్షల వచ్చేదని, దానిని రూ.1.8 లక్షలకు పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంతో కలిపితే దాదాపు రూ.2 లక్షలు అందుతాయన్నారు. అదేవిధంగా మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ప్రస్తుతం రూ.12 వేలు పొందుతుండగా, దానిని రూ. 20,000కు పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తోందని వెల్లడించారు. అలాగే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఒడిశా అంత్యోదయ గృహ యోజనను కూడా ప్రారంభించాలని యోచిస్తోందని తెలిపారు. దీని కింద అగ్ని ప్రమాదాలు, ఏనుగుల దాడి లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాలలో ఇళ్లు దెబ్బతిన్న వారికి సాయం అందించబడుతుందని చెప్పారు.

తోటి విద్యార్థిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న దోప్పరసేన జంబిక

కొరాపుట్: ఇద్దరి విద్యార్థుల మధ్య ఘర్షణ కత్తితో దాడికి దారి తీసింది. కొరాపుట్ జిల్లా కక్కిరిగుమ్మ పోలీస్‌స్టేషన్ పరిధి లక్ష్మీపూర్ సమితి పంచడా సేవాశ్రమంలో ఈ దారుణం చోటు చేసుకుంది. భోజనా ల వద్ద ఇద్దరు 10వ తరగతి విద్యార్థుల మధ్య ఘర్ష ణ జరిగింది. దీంతో లింగు మండగి అనే విద్యార్థి కూరలు కోసే కత్తితో దోప్పరసేన జంబిక అనే విద్యార్థి కడుపులో పొడిచాడు. ఇది చూసి మిగతా విద్యార్థులు భయభ్రాంతులై పరుగులు తీశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఉపాధ్యాయులు బాధితుడిని కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కక్కిరిగుమ్మ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామికీకరణతోనే ఆర్థిక ప్రగతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారిశ్రామిక అభివృద్ధితోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని అందుకోసం పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ ప్రత్యేక సమావేశంలో సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. నూతన పారిశ్రామిక విధానం 2024-2029 లో భాగంగా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామని, పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమలశాఖ, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ(ఐడీపీ)లను అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలో అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాలని వివరించారు. జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జె.ఉమామహేశ్వర రావు సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు.

ఆక్రమిత స్థలాల స్వాధీనానికి ఆదేశం

కోటబొమ్మాళి: పెద్దకొండ దిగువ ప్రాంతంలోని 280,117-1 సర్వే నంబర్‌లలో సుమారు 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ లే-అవుట్‌లు వేసినట్లు తన దృష్టికి వచ్చిందని, ఆ స్థలంపై సమగ్ర విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీచేసినట్లు తహసీల్దార్ ఆర్.అప్పలరాజు తెలిపారు.


భువనేశ్వర్: మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు రాఖీ కడుతున్న చిన్నారులు


భువనేశ్వర్: గవర్నర్ రఘుబర దాస్‌కు రాఖీ కడుతున్న మహిళ


భువనేశ్వర్: సీఎం మోహన్‌చరణ్ మాఝీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు


కొరాపుట్: బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కి రాఖీ కడుతున్న బ్రహ్మ కుమారీలు

ఎన్నాళ్లయినా చెరగని బంధం

అన్నా చెల్లెల అనుబంధం..!

అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అన్నా, తమ్ముళ్లకు తోబుట్టువులు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు. పలు వర్గాల మహిళలు గవర్నర్ రఘుబర్ దాస్‌కు రాఖీలు కట్టారు. అలాగే సీఎం మోహన్‌చరణ్ మాఝీకి మహిళలు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం నవీన్ పట్నాయక్ చిన్నారులతో వేడుకలు జరుపుకున్నారు. డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడ మరో డిప్యూటీ సీఎం కనక వర్ధన్ సింగ్‌కు రాఖీ కట్టి సోదరభావం చాటుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


కొరాపుట్: నబరంగ్‌పూర్ సరస్వతీ శిశు మందిర్‌లో రాఖీ పౌర్ణమి


భువనేశ్వర్: డిప్యూటీ సీఎంల రక్షా బంధన్ వేడుకలు


కొరాపుట్: నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝికి రాఖీలు కడుతున్న కిన్నెరులు


పర్లాకిమిడి: సరస్వతీ శిశువిద్యా మందిర్‌లో రక్షా బంధన్ వేడుకలు


కొరాపుట్: జైలు నుంచి రాఖీ కట్టించుకుంటున్న ఖైదీ


భువనేశ్వర్: చెట్టుకు రాఖీ కడుతున్న మహిళలు


పర్లాకిమిడి: మహారాజా బాలికల ఉన్నత పాఠశాలలో..


రాయగడ: నవజీవన్ ట్రస్ట్‌లో రాఖీ వేడుకలు

శ్రీక్షేత్రంలో బలభద్రుని జన్మదినోత్సవం


మూల విరాటులకు అలంకరించిన పట్టుపోగుల రాఖీలు, వక్క మాలలు

భువనేశ్వర్: పూరీ శ్రీక్షేత్రంలో బలభద్రుడి జన్మదినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. బలభద్రుడు శ్రవణా నక్షత్రం మకర లగ్నంలో శ్రావణ పూర్ణిమ నాడు జన్మించాడు. ఈ సందర్భంగా శ్రీక్షేత్రంలో ప్రత్యేక ఉత్సవం నిర్వహించడం విశేషం. నాగలిని తన ఆయుధంగా హలధరునిగా ప్రత్యక్షమైన బలభద్ర స్వామి జన్మదినం పురస్కరించుకుని పాడి పశువులను అలంకరించి పూజించారు. శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన ఆరు విగ్రహాలను (శ్రీజగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర, సుదర్శన్, భూదేవి మరియు శ్రీదేవి) బంగారు ఆభరణాలతో అలంకరించారు.

సుదర్శన విజే

సుదర్శనుడు బంగారు మాలలతో అలంకృతుడై


మార్కండేయ పుష్కరిణి తీరంలో బలభద్ర స్వామి మట్టి ప్రతిమ తయారీ

చౌడోలాలో మార్కండేయ పుష్కరిణికి ఊరేగింపుగా తరలి వెళ్లాడు. పుష్కరిణి నడి బొడ్డున ఉన్న మండపంపై శుద్ధ సువారొ సేవకులు తడి మట్టితో బలభద్రుడి విగ్రహాన్ని తయారు చేసి మంత్ర పఠనంతో ఆవహాహం పూజలు నిర్వహించారు. అనంతరం ఈ ప్రతిమని పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. అనంతరం సుదర్శన భగవానుడు ఆశ్రమ పరిక్రమ ముగించుకుని శ్రీమందిరానికి చేరాడు. కాగా రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని పూరీ శ్రీజగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్న ధూపం తర్వాత సోదరి సుభద్ర ఇద్దరు సోదరులు బలభద్రుడు, శ్రీజగన్నాథులకు రాఖీధారణ వేడుకగా నిర్వహించారు. సోదర సోదరీమణుల పవిత్ర బంధానికి చిహ్నంగా శ్రీజగన్నాథుని సంస్కృతిలో ఈ వేడుక చోటు చేసుకోవడం విశేషం. పటొరా బిషాయి సేవకులు సిద్ధం చేసిన పట్టు పోగుల రాఖీలు భగవంతుడికి అలంకరించారు.

రాఖీపై రక్తపు మరక

కొరాపుట్: అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీకగా దేశమంతటా రాఖీ పండగ జరుగుతుండగా బ్రహ్మపురలో రక్తం చిందింది. సోమవారం బొడ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధి జగన్నాథ విహార్ 7వ లైన్‌లో అన్న దాడి చేయడంతో చెల్లెలు ప్రజుక్త పాణిగ్రాహీ (13) మృతి చెందింది. జగన్నాథ విహార్‌లో నివాసముంటున్న తన పెద్దనాన్న దుర్గా ప్రసాద్ పండా ఇంటికి అన్న ఆయస్మాన్ పాణిగ్రాహితో కలిసి ప్రజుక్త వెళ్లింది. అక్కడ పూజలు ముగిసిన వెంటనే పెద్దనాన్న కుమారుడికి రాఖీ కట్టి ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంది. ఇంటి కింద పెద్దలందరూ ఉండగా మేడ మీద పిల్లలు ఆడుకుంటున్నారు. ఇంతలో మేడ మీద నుంచి కేకలు వినిపించాయి. వెంటనే స్థానికులు పైకి వెళ్లగా ప్రజుక్త, ఆయస్మాన్‌లు గాయాలతో పడి ఉన్నారు. వెంటనే వీరిద్దరినీ బ్రహ్మపుర ఎంకేసీజీ వైద్య కళాశాలకి తరలించారు. అయితే అప్పటికే ప్రజుక్త మృతి చెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. ఆయస్మాన్ పరిస్థితి విషమించగా భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఘటనా స్థలం నుంచి వాళ్ల పెద్దనాన్న కుమారుడు అశుతోష్ పాణిగ్రాహీ పరారైనట్లు గుర్తించారు. కొంతసేపటికి హింజలికట్ వద్ద రోడ్డు ప్రమాదంలో అశుతోష్ గాయాలుతో పడి ఉన్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు అతడిని హింజలికట్ ఆస్పత్రిలో చేర్పించారు. వీరిద్దరిపై అన్న అశుతోష్ పాణిగ్రాహీ దాడిచేసి పరారై, రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు తెలుస్తోంది. నిందితుడు అశుతోష్ ఎంఫార్మా విద్యార్థి కావడం గమనార్హం. రాఖీ కట్టడానికి వచ్చిన చెల్లెలని హత్య చేయడం అందరినీ విషాదంలో ముంచింది.


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పుష్ప-2లో కొరాపుట్ గిరిజనులు


ఫిల్మ్ సిటిలో ఉన్న గిరిజనులు

కొరాపుట్: పాన్ ఇండియా చిత్రంగా రూపుదిద్దుకుంటున్న పుష్ప-2లో నటించే అవకాశం కొరాపుట్ జిల్లా గిరిజనులకు వచ్చింది. ప్రస్తుతం కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలకు చెందిన అనేక గిరిజన బృందాలు హైదరాబాద్‌లోని ఫిల్మ్ సిటిలో ఉన్నారు. ఈ ప్రాంతంలోని గిరిజనుల జీవన శైలిలో భాగంగా ఉండే ధింసా నృత్యాన్ని చిత్రీకరిస్తున్నారు. బొండా, కోయ, దురువా, పరజా జాతులకు చెందిన నృత్యాలు తెలిసిన బృందాలు గిరిజన నృత్యాలు ఈ సినిమాలో చిత్రీకరిస్తున్నారు. పుష్ప-2 చిత్రంలోని కొంతభాగం మల్కన్‌గిరి జిల్లాలో గతంలో చిత్రీకరించారు.

సంక్షిప్తంగా...

ఏనుగు మృతి

భువనేశ్వర్: నగర శివారులోని చందక వన్యప్రాణుల అభయారణ్యంలో రాము అనే ఏనుగు మృతి చెందినట్లు సోమవారం గుర్తించారు. విద్యుత్ షాక్‌తోనే 40 ఏళ్ల ఈ ఏనుగు మృతి చెందినట్లు అనుమానిస్తున్నామని సంబంధిత వర్గాలు తెలిపాయి. విద్యుత్ శాఖ, అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కళేబర పరీక్ష తర్వాతే కారణం తెలుస్తుందని డీఎఫ్‌వో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చందక అభయారణ్యంలో 15 ఏళ్ల ఏనుగు, అది మింగిన ముడిబాంబు నోటిలో పేలడంతో గాయాలతో మరణించింది. అడవి పందులను వేటాడేందుకు బాంబును అమర్చిన గుమ్మడి కాయ తినడంతో జరిగిన ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది. అభయారణ్యంలో ఏనుగులకు రక్షణ కొరవడుతోంది.

ఘనంగా ఫొటోగ్రఫీ


వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక బ్రాహ్మణ సీతాపురం వద్దనున్న ఆశ్రా వయోవృద్ధుల పునరావాస కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జిల్లా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. దీనిలో భాగంగా ఆశ్రమానికి దుప్పట్లు, పండ్లు, కాయగూరలు, నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. వేడుకల్లో సంఘం కార్యవర్గ సభ్యులు అమర్, ఢిల్లీరావు, జగదీష్, గిరి, వేణు, శ్యాం, కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జయపురం సంబాద్ సాహిత్య ఘర్ సభ్యులు పేర్కొన్నారు. దీనిలో భాగంగా సాహిత్య ఘర్ కార్యదర్శి అశోక్ మహారాణ నేతృత్వంలో ఏనుగుల శాల(హతిశాల) ప్రాంతంలో కపిలేశ్వర ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సాహిత్య ఘర్ సభ్యులు విజయలక్ష్మీ పాణిగ్రహి, ప్రమోద్ కుమార్ రౌళో, కవితామంజురి పొలాయి, కవితా సాహు, సంతోష్‌కుమార్ సాహు, డా.సుదాంశు శేఖర పట్నాయిక్ పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయగడలో భారీ వర్షం


ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయగడ: పట్టణంలో భారీ వర్షం సోమవారం కురిసింది. స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి శ్రీరామ టాకీస్ వరకు ఉన్నటువంటి రహదారి నదిని తలపించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

తల్లులదే ప్రధాన పాత్ర

జయపురం: పిల్లలకు క్రమశిక్షణ అలవర్చడంలో తల్లులు ప్రధాన పాత్ర పోషించాలని బొయిపరిగుడ సాహిద్ లక్ష్మణ్ నాయక్ కళాశాల అధ్యాపకురాలు మానసీ ఆచార్య అన్నారు. స్థానిక శారదా వాహిణీ సరస్వతీ శిశు మందిరంలో సోమవారం నిర్వహించిన మాతృ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. హెచ్‌ఎం దిలీప్ కుమార్ శతపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శిశువాటిక ప్రతినిధి మమిత బొరద, శిశుమందిర పరిచాలన కమిటీ కార్యదర్శి కిశోర్ చంద్ర పండ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

ఘనంగా సత్యనారాయణ జయంతి


సత్యనారాయణ జయంతి ఉత్సవంలో పాల్గొన్న అతిథులు

పర్లాకిమిడి: స్థానిక ఒడియా మంగళి వీధి ఉత్కళ హితేషిణి భవనంలో కవి, నాట్యకారుడు, తామ్రలిపి లేఖకుడు డాక్టర్ సత్యనారాయణ రాజగురు 122వ జయంతి ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒడియా సాహిత్యానికి ఆయన చేసిన సేవను గుర్తు చేసుకున్నారు. అనంతరం కేంద్ర అవార్డు గ్రహీత బినోద్ చంద్ర జెన్నా రాసిన గజపతి జిల్లాలో పర్యాటక ప్రాంతాలు పుస్తకాన్ని డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ చంద్రశేఖర హోత్రా ఆవిష్కరించారు.

కార్యక్రమంలో మహిళా స్నాతకోత్సవ కళాశాల అధ్యక్షురాలు డా.రీనా సాహు, ఒడియా సాహిత్య ప్రహరి పూర్ణచంద్ర మహాపాత్రో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మిగిసిన బోల్ భం దీక్షలు

రాష్ట్రంలో గత నెల రోజులుగా భక్తులు చేపట్టిన బోల్ భం దీక్షలు విరమించారు. దీనిలో భాగంగా శివ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నేటితో ఒడిశాలో శ్రావణ మాసం ముగిసి భాద్రపదం మొదలవుతుంది. – సాక్షి నెట్‌వర్క్


పర్లాకిమిడి: శ్రీబలుంకేశ్వర మందిరంలో బోల్‌భం భక్తుల పూజలు


జయపురం: బోల్‌భం కావిడిలతో చిన్నారులు


పర్లాకిమిడి: పవిత్ర నదీ జలాలను మందిరానికి తీసుకెళ్తున్న దృశ్యం


కొరాపుట్: బోల్ భం యాత్ర చేస్తున్న మహేశ్వర్ పండా

ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ బెస్ట్ క్యాడెట్‌గా స్వీకృతి

శ్రీకాకుళం న్యూకాలనీ:

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ డి.స్వీకృతి చరిత్ర లిఖించింది. కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న యువ ఉమెన్ క్యాడెట్ విశాఖపట్నం ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ తరపున బెస్ట్ క్యాడెట్‌గా గుర్తింపు పొందింది. ఇటీవలి గ్రూప్ కమాండర్ నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఆర్‌డీసీ బెస్ట్ క్యాడెట్ పోటీలు జరిగే అనంతపురం ఎన్‌సీసీ క్యాంప్‌నకు ఎంపికై శభాష్ అనిపించింది. కళాశాల నుంచి ఈ ఫీట్ సాధించిన మొదటి మహిళా ఎన్‌సీసీ క్యాడెట్‌గా స్వీకృతి గుర్తింపు అందుకుంది. స్వీకృతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు సోమవారం కళాశాలలో అభినందించారు.

కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, మహిళా కేర్ టేకర్‌లు పావని, వరలక్ష్మి, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

23న గ్రామసభలు నిర్వహించాలి

• అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పార్వతీపురం: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 23న గ్రామసభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామ పంచాయతీలో పారిశుధ్యంపై స్థానిక ఎంపీడీఓను ప్రశ్నించారు. పంచాయతీలో పారిశుధ్యం సక్రమంగా లేదని, ఫైలేరియా వ్యాధి వ్యాప్తి ఉందని తమ దృష్టికి వచ్చిందని, దానిపై చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టుల విషయంలో గ్రామ పంచాయతీ బాధ్యత వహించాలని సూచించారు. వార్డు సభ్యులు పనులను అమలు చేయడం, పర్యవేక్షించడం చేయాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులు, ప్రాజెక్టుల ఆమోదం కోసం అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ బి. సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, డ్వామా పీడీ రామచంద్ర రావు, పీఆర్ ఈఈ కృష్ణాజీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లఘుచిత్ర ప్రదర్శనలో పెంట విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామ జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు జీవ వైవిధ్యం-యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి లఘుచిత్ర ప్రదర్శన పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు.ఈనెల 12న విజయనగరంలోని కస్పాహైస్కూల్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రదర్శించిన పాఠశాల పదోతరగతి విద్యార్థులు ఎం.స్పందన, సీహెచ్ అలేఖ్యలను జిల్లా విద్యాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కునుకు సింహాచలానికి డీఈఓ ప్రత్యేకాభినందనలు తెలిపారు.

ఏనుగుల సమస్య పరిష్కారానికి ప్రణాళిక


అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: కొన్నేళ్లుగా కురుపాం నియోజకవర్గంలో తిష్ట వేసిన ఏనుగుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అటవీశాఖ అధికారులతో అన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం ఆమె అటవీశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండకుండా ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేసుకోవాలని, ఏనుగుల సంచారం సమాచారం ఎప్పటికప్పుడు సమీప గ్రామస్తులకు అందజేయాలని, గిరిజనులకు డీ పట్టాలు మంజూరు చేసేందుకు పెండింగ్‌లో ఉన్న అటవీ అనుమతులు మంజూరు చేయాలని అటవీశాఖ అధికారులను కోరారు. సమావేశంలో కురుపాం రేంజర్ మణికంఠేశ్వర రావు, జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్, టీడీపీ నాయకులు దొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, పోలూరు శ్రీనివాసరావు, టీఆర్ఎఫ్ అధ్యక్షుడు రొబ్బా లోవరాజు తదితరులున్నారు.

పశువులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు

సీతానగరం: ఒడిశా నుంచి విశాఖకు వ్యాన్‌లో 20 పశువులను సోమవారం తరలిస్తుండగా వ్యాన్‌తో పాటు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు తరలించడానికి వ్యాన్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారన్నారు. మండలంలోని జోగింపేట సమీపంలో పశువులతో వెళ్తున్న వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుముందు హాజరు పరచనున్నామని తెలిపారు.

పొంచి ఉన్న రక్త పిశాచాలు




ఇళ్లల్లో దోమల నివారణకు స్ప్రే చేస్తున్న కార్మికులు

దోమల నివారణ దినంగా ఎందుకంటే

ప్రపంచానికి కామన్ శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్ రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకుగాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ప్రకటించింది.


పారిశుధ్యంపై సూచనలిస్తున్న సిబ్బంది

• నివారించకపోతే ప్రమాదమే
• రోజురోజుకు వృద్ధి చెందుతున్న దోమలు
• పెరిగిపోతున్న మలేరియా, డెంగీ కేసులు
• నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

సీతంపేట: చిన్నదోమ ఎంత పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల కాలంలో రోజురోజుకు మలేరియా, డెంగీ కేసుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో ఎక్కువ మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిన వారి సంఖ్యకూడా ఎక్కువగానే ఉంటోంది.

దోమలను అరికట్టేదెలా..?

దోమ ఎగురుతున్నపుడు పట్టుకోవడం, చంపడం చాలా కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. అయితే దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నప్పుడు నాశనం చేయడం చాలా సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు (లార్వా) నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ వంద నుంచి 200 వరకు గుడ్లను పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లో దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా, ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతాయి.

దోమలపై దాడికి లక్షల్లో ఖర్చు

దోమలు ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతి నెల పచారి సమాగ్రి మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్, మస్కిటో ధూప్ స్టిక్స్ వంటి వాటికి నెలకు రూ.100 నుంచి రూ.500 వరకు ఒక్కో కుటుంబం ఖర్చు చేస్తోంది. ఇవి కాకుండా దోమల బ్యాట్స్, దోమతెరలు, యాంటి మస్కిటో మెస్ వంటి వాటికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించక తప్పడం లేదు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల నివారణకు ప్రత్యేకంగా ఖర్చు చేయాల్సిందే.

ఆడదోమలే ప్రమాదకరం..

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడ దోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈ క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంధుల్లోకి చేరుతుంది. అక్కడ పారాసైట్‌లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడ దాని లాలాజలంతో పాటు పారసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది.

అనర్థాలివే..

ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా,డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమలవల్ల బోదకాలు వస్తాయి.

నివారణ ఇలా..

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విష జ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి దోమల నివారణకు ఇంట్లో వాడతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టడమే ఉత్తమం.

- వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు.
- వేప, కొబ్బరినూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు.
- ఇళ్లల్లోకి దోమలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాల వద్ద తులసి మొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూరం చేస్తాయి. దోమలను వృద్ధి కాకుండా చూస్తాయి.
- లెమన్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌సెక్ట్ రిప్లెంట్‌గాను పనిచేస్తుంది.
- కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దానినుంచి వచ్చే పొగకు దోమలు మాయమవుతాయి.

అప్రమత్తంగా ఉండాలి



దోమల నుంచి వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రెండు దఫాలుగా దోమల నివారణ మందును మలేరియాశాఖ ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేశాం.
– విజయపార్వతి, డీఎంహెచ్‌వో

పారిశుధ్యంపై చైతన్యం



పారిశుధ్యంపై గ్రామాల్లో చైతన్య, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో దోమతెరల వినియోగంపై గిరిజనులకు చైతన్యం చేస్తున్నాం.
– జి.మోహన్‌రావు, మలేరియా నివారణా సబ్‌యూనిట్ ఆఫీసర్, సీతంపేట

వినతుల పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ రూమ్

• అర్జీదారులకు కచ్చితమైన సమాధానం పంపాలి
• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతుల పరిష్కారానికి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖల నుంచి సిబ్బందిని ఒక్కొక్కరు వంతు ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో డిప్యూట్ చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భోగంగా అధికారులతో కలెక్టర్ మాట్లాతూ కలెక్టరేట్‌కు వచ్చే వినతులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని, అర్జీదారులతో మాట్లాడి, అర్జీదారు సంతృప్తి చెందిన తర్వాతనే వారి ఫొటోతో పాటు సమాధానాన్ని అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఉండాలని రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలన్నారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని స్పష్టం చేశారు.

129 వినతులు

సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మధవన్, ఆర్‌డీఓ ఎస్‌డీ అనిత ప్రజల నుంచి 129 వినతులు స్వీకరించారు.

ఎస్‌కోట మేజర్ పంచాయతీ ఆస్తులు పరిరక్షించాలి

ఎస్‌కోట మేజర్ పంచాయతీ ఆస్తులను అక్రమంగా దోచుకుంటున్న వారి దారుణాలను అడ్డుకోవాలని ఆ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌తో పాటు వార్డు సభ్యులు పలువురు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి కోరారు. మేజర్ పంచాయతీ పరిధిలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ప్రైవేట్ వ్యక్తి గృహ నిర్మాణం చేశారు. అయితే ఆయన అప్రూవ్డ్ స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రధాన కాలువపై వరకు నిర్మాణం చేపట్టారు. ఆ గృహం నిర్మాణ అప్రూవల్ రద్దు చేయాలని వార్డు సభ్యులు తీర్మానం చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. సర్పంచ్, విస్తరణాధికారులు ఆ తీర్మానాన్ని పట్టించుకోకుండా ఆక్రమణదారునికి మద్దతు ఇస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. అదే విధంగా పంచాయతీ నిర్మాణాల్లో అద్దెకు ఇచ్చి వాటిలో అక్రమాలు అరికట్టాలని కోరారు. పంచాయతీ తీర్మానం ప్రకారం ఒక్కో దుకాణానికి రూ.27 వేలు రావాల్సిన చోట కేవలం రూ.2,700 మాత్రమే అద్దెలను వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని అర్జీలో వివరించారు.

మాజీ మంత్రి బొత్సను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి మండల నాయకులు

చీపురుపల్లి: మాజీ మంత్రి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి మండల నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు నాయకులు విశాఖపట్నం వెళ్లి ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై స్థానిక నేతలు తమ సంతోషాన్ని ఆయనతో పంచుకున్నారు. కార్యక్రమంలో పతివాడ రాజారావు, దన్నాన జనార్దనరావు, రేవల్ల సత్తిబాబు, రఘుమండ త్రినాథ్, పనస అప్పారావు, కోరాడ పృథ్వీ, గిరడ రాందాసు, కొమ్ము చిరంజీవి, ముల్లు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, కర్రోతు ప్రసాద్, ఎల్.ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

హామీని వెంటనే అమలు చేయాలి

• పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వాలేటి తవిటినాయుడు


విలేకరులతో మాట్లాడుతున్న తవిటినాయుడు

బలిజిపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టు లాంటి 117జీఓను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని పీఆర్‌టీయూ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు వాలేటి తవిటినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బలిజిపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే ఇవ్వాలి. గతంలో ఉన్నత పాఠశాలల్లో హేతుబద్ధీకరణ వల్ల పోయిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను రోల్ ప్రాప్తికి వెంటనే మంజూరుచేయాలి. ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను, తరగతికి ఒకరు వంతున నియమించాలని, ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లను, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలి. పాఠశాల గ్రాంట్లు విడుదల చేయాలి. యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాంబమూర్తి, మండలశాఖ ప్రధాన కార్యదర్శి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

జొందపల్లి: మండలంలోని గరుడుబిల్లి-గొట్లాం గ్రామాల మధ్య ఒంపల్లి రైల్వే వంతెన సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లుగా గమనించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు విజయనగరం రైల్వే ఎస్సై సోమవారం తెలిపారు. మతునికి 65 సంవత్సరాలు ఉంటాయని, శరీరంపై తెల్లరంగు షర్టు, రెడ్ కలర్ లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపాడు. రైలు నుంచి ప్రమాదశావత్తు జారి పడి కానీ, పట్టాలు దాటుతుండగా కానీ రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో భద్రపరిచామని అచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


రాము మృతదేహం

దెంకాడ: మండలంలోని అమకాం బస్‌స్టాప్ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో తుప్పల్లో పడిపోయిన ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు రాము(25) అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ఎస్సై ఎ.సన్యాసినాయుడు సోమవారం తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సన్‌రేలో కనస్ట్రక్షన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రాము ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై వెళ్తూ అదుపు తప్పి తుప్పల్లో పడిపోయాడు. రాత్రి 10:30 గంటల ప్రాంతంలో మరణించి ఉంటాడని, సోమవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పసర మందుతో చిన్నారికి అస్వస్థత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ మూలజమ్ము గ్రామంలో పసర మందు పట్టడంతో నాలుగు నెలల చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురైంది. వివరాలిలా ఉన్నాయి. భామినికి చెందిన బిడ్డిక అశ్విని తన నాలుగు నెలల పాప సహస్రను వెంటబెట్టుకుని కొన్ని రోజుల క్రితం తాతగారింటికి మూలజమ్ము వచ్చింది. రెండు రోజులుగా సహస్రకు జ్వరం రావడంతో స్థానికంగా ఇచ్చిన పసర మందు పట్టారు. అయితే సహస్ర కడుపునొప్పి, ఆయాసం, విరేచనాల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో సోమవారం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పెదకుదమలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పంటపొలాల్లో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వరిపంట ఉబాలు పూర్తి కావడం, అరటి పంటదశలో ఉండడం, పామాయిల్ తోటలు విస్తృతంగా ఉండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాన ఏనుగులు గ్రామాల్లోకి వచ్చే అవకాశముందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలు

విజయనగరం: జిల్లా వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సీనియర్ స్త్రీ, పురుషుల బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. మూడు రోజులుగా జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో భాగంగా ఉమెన్ సింగిల్స్ విభాగంలో టి.సూర్య (కృష్ణా జిల్లా), నవ్య (చిత్తూరు)లు మొదటి, రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో విశాఖకు చెందిన బాల ప్రణయ్, తూర్పుగోదావరికి చెందిన భార్గవ శ్రీరామ్‌లు విజేతలుగా నిలిచారు. అదేవిధంగా ఉమెన్స్ డబుల్స్ విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఆకాంక్ష, కృష్ణాజిల్లాకు చెందిన మార్నిత్యాల జట్టు ప్రథమ స్థానం దక్కించుకోగా, గుంటూరు జిల్లాకు చెందిన బి.స్రవంతి, డి.దీపికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. మెన్స్ డబుల్స్ విభాగంలో భార్గవ్‌రామ్, విశ్వతేజ్‌ల జట్టు మొదటిస్థానంలో, కె.శ్రీమోహిత్, షేక్ ముమేయర్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భార్గవ రామ్, రష్మితల జోడి ప్రథమస్థానం, ఎ.వంశీ కృష్ణ రాజ్, సూర్య కరిష్మాల జోడీ ద్వితీయస్థానం దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో కాకినాడ, బెంగళూరుల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆశించారు. కార్యక్రమంలో జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ కేఏ.నాయుడు, ఇందుకూరి రఘురాజు, డాక్టర్ వీఎస్.ప్రసాద్, ఎంకేబీ శ్రీను, ఎన్.సురేష్, వై.కుసుంబచ్చన్, పొట్నూరు శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ. సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


సహకార కార్యాలయంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన సహకార శాఖ కార్యాలయంలో వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. కంప్యూటరీకరణ పనులకు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించు కోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన సభ్యులందరి వివరాలను కంప్యూటరీకరించాలని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను స్వావలంబన చేయడానికి భారత ప్రభుత్వం కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టిందని, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుకు సదరు డేటా జాతీయస్థాయిలో అనుసంధానం అవుతుందని, తద్వారా పీఏసీఎస్ కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, రుణాలను వేగంగా పంపిణీ చేయడం, లావాదేవీల ఖర్చులను తగ్గించడం, చెల్లింపులలో అసమతుల్యతను తగ్గించనున్నారని చెప్పారు. సంఘాల కార్యకలాపాలలో పారదర్శకత పెరుగుతుందని, రైతులలో పీఏసీఎస్ పనితీరులో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. కామన్ అకౌంటింగ్ సిస్టమ్ (సీఏఎస్), మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) అమలు ద్వారా పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, రుణాలు, రుణాల రీషెడ్యూల్ పనులలో రైతులకు సేవలు అందించవచ్చని స్పష్టం చేశారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

పార్వతీపురం: నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక, గృహ నిర్మాణం, సంపూర్ణ పోషణ అభియాన్, పీఏసీఎస్ కంప్యూటరీకరణ, ఈ-పంట తదితర అంశాలపై సమీక్షించారు.

విశ్వభాషలందు వెలుగు తెలుగు



ప్రముఖ గజల్స్ గాయకుడు వినోద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: విశ్వభాషలందు వెలుగు తెలుగు అని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. తెలుగువారమనే ముద్ర భాష కారణంగానే వస్తుందని, ప్రపంచంలో తెలుగు ప్రతిభకు జై కొట్టని దేశం లేదని, తెలుగువారు రాణించని రంగమే లేదని పేర్కొన్నారు. ఈ నెల 29న తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురజాడ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ గజల్స్ గాయకుడు వినోద్‌తో తెలుగు భాష పరిరక్షణకు సంబంధించిన గజల్స్ పాడించారు. గజల్స్ వినోద్ తన గానం ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌తో కలిసి గజల్స్ వినోద్‌ను గురుప్రసాద్ సత్కరించారు.